9

సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025

గరిష్టం/కనిష్టం
32.0/22.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. గాలిలో తేమ శాతం పెరగనుంది.



ఆదిలాబాద్ పట్టణంలో మూసిఉన్న దుకాణాలు



వెల్‌కం టు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్..

- విమానాశ్రయంతోపాటు వాయుసేన స్టేషన్ కూడా..
- మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేసిన ఏఏఐ
- త్వరలోనే పనులు మొదలయ్యే అవకాశం
- అభివృద్ధికి పడనున్న బాటలు
- 'సాక్షి' చొరవకు అభినందనల వెల్లువ

గుడ్‌మార్నింగ్ ప్యాసింజర్స్.. వెల్‌కం టు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్.. ఈ అనౌన్స్‌మెంట్‌కు ఇక ఎక్కువ సమయం పట్టకపోవచ్చు. జిల్లావాసుల ఆశలకు రెక్కలు వచ్చేలా దశాబ్దాల వారి కల త్వరలోనే సాకారం కానుంది. అడవుల జిల్లాలో ఇక గాలిమోటర్ టేకాఫ్ కానుంది. విమానాశ్రయంతో పాటు వాయుస్టేషన్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. తాజాగా మాస్టర్ ప్లాన్ రూపుదిద్దుకుంది. ఈ ప్రాంతప్రజల మనోభావాలకు అక్షర రూపం ఇచ్చిన 'సాక్షి' సంకల్పం సైతం సిద్ధించింది. సామాజిక బాధ్యతగా చర్చావేదికతో ముందడుగు వేసిన 'జనం గొంతుక'కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. – కైలాస్‌నగర్

దశాబ్దాలుగా జిల్లావాసులు ఎదురుచూస్తున్న ఆదిలాబాద్ విమానాశ్రయ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఎయిర్‌పోర్టుతో పాటు ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ సైతం త్వరలోనే అందుబాటులోకి రానుంది. రానున్న 30 ఏళ్ల భవిష్యత్ అవసరాలు దృష్టిలో ఉంచుకుని అధునాతన వసతులతో నిర్మించాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది. భారీపాఠ విమానాలు, ఐఏఎఫ్ జెట్లు సైతం ఎగిరేందుకు వీలుగా మూడు కిలోమీటర్ల కామన్ రన్‌వేతో కూడిన విమానాశ్రయం నిర్మించాలని నిర్ణయించింది. సర్వేలన్నీ పూర్తి కావడంతో త్వరలోనే టెండర్లు పిలిచేందుకు కేంద్రం సిద్ధమైంది.

జిల్లా అభివృద్ధికి బాటలు ...

వెనుకబడిన ప్రాంతమైన ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుముఖత వ్యక్తం చేశాయి. అంతేకాకుండా ప్రత్యేక దృష్టి సారిస్తుండటంతో త్వరలోనే పనులు మొదలయ్యే అవకాశముంది. ఇప్పటికే 362 ఎకరాల భూమి అందుబాటులో ఉంది. అదనంగా మరో 300 ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉండటంతో త్వరలోనే ఈ ప్రక్రియ షురూకానుంది. పనులు పూర్తయి ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే జిల్లా అభివృద్ధికి బాటలు పడే అవకాశముంది. ఉత్తర, దక్షిణ భారతావనికి రవాణా సౌకర్యం సులభతరం కానుంది. వాణిజ్యపరంగా కార్పొరేట్ కంపెనీలు క్యూ కట్టే అవకాశముంటుంది. జిల్లాకేంద్రంలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు సైతం పెరగనున్నాయి. ఫలితంగా ఈ ప్రాంత యువతకు విద్యా, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడనున్నాయి. రిమ్స్‌లో స్పెషలిస్టు వైద్యులు అందుబాటులోకి వచ్చి పేదలకు అధునాతన వైద్య సేవలు అందే అవకాశముంటుంది.

ప్రజల గొంతుకైన 'సాక్షి'

జిల్లా కేంద్రంలో ఎయిర్‌పోర్టు అవశ్యకత.. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను 'సాక్షి' గుర్తించింది. దశాబ్దాల కల సాకారం చేయాలని సంకల్పిస్తూ వారి తరపున గొంతెత్తింది. తొలుత చర్చా వేదికకు శ్రీకారం చుట్టింది. 'రెక్కలపై ఆశలు' అంటూ ఆయా వర్గాల అభిప్రాయాలను పాలకుల దృష్టికి తీసుకెళ్లింది. అంతేకాకుండా 'మామా.. ఎయిర్‌పోర్ట్ వస్తే మానకేమొస్తది' అంటూ స్థానిక యాసలో వివరించిన కథనం అందరినీ ఆలోచింపజేసింది. తద్వారా ఈ ప్రాంత పాలకులపై ఒత్తిడి పెరిగింది. వారు చట్టసభల్లో గళమెత్తారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రస్తావించగా, పార్లమెంట్‌లో ఎంపీ నగేశ్ కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం అసెంబ్లీ సాక్షిగా స్పందిస్తూ 'ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్టు తెస్తా.. అది నా బాధ్యత' అంటూ జిల్లా వాసులకు భరోసా కల్పించారు. ఆ వెంటనే కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు మార్గం సుగమమైంది. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖలో భాగమైన భారత వాయుసేన (ఐఏఎఫ్) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనిని ప్రస్తావిస్తూ ' రెక్కలొస్తున్నాయి..' అంటూ 'సాక్షి' జిల్లావాసులకు తీపికబురు అందించింది. తాజాగా ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించి ఎయిర్‌పోర్టు అథారిటీ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య అంగీకారం కుదిరింది. ఎయిర్‌పోర్టుతో పాటు ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నిర్మాణానికి ఏఏఐ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి కానుంది. ఆ వెంటనే పనులు ప్రారంభం కానుండడంపై జిల్లావాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రత్యేకంగా 'సాక్షి' చొరవను సర్వత్రా కొనియాడుతున్నారు.



ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సంబంధించి 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలు..

నా ప్రయత్నం ఫలించింది..



జిల్లావాసుల ఆకాంక్షలకు అనుగుణంగా ఎయిర్‌పోర్టు అవశ్యకతను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. పార్లమెంట్‌లో రెండుసార్లు ప్రస్తావించాను. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా ప్రతిపాదనలు వచ్చాయి. దీంతో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను స్వయంగా కలిసి విన్నవించాను. వారు స్పందించి అవసరమైన మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవడంతో నా ప్రయత్నం ఫలించినట్లయింది. త్వరలోనే పనులు వేగవంతమయ్యే అవకాశముంది.

– గొడం నగేశ్, ఆదిలాబాద్ ఎంపీ


ప్రధానమంత్రి మోదీకి కృతజ్ఞతలు



ఎయిర్‌బస్– 380, బోయింగ్–737 విమానాలు దిగే సామర్థ్యంతో కూడిన రన్‌వే నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. ఇప్పటికే భూముల ధరలు భారీగా పెరిగాయి. భవిష్యత్తులో భూ సేకరణకు ఇబ్బంది కలగకుండా వందేళ్ల అవసరాలకు సరిపడా బోయింగ్ విమానాల రాకపోకలు సైతం సాగించే రన్‌వేతో కూడిన ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రయత్నిస్తున్నాం. దీనిపై ప్రభుత్వానికి విన్నవించగా అంగీకరిస్తూ సీఎం సంతకం కూడా చేశారు. ఎయిర్‌పోర్టుతో పాటు వైమానిక శిక్షణ కేంద్రానికి ఏఏఐ మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయడం సంతోషంగా ఉంది. ప్రధానమంత్రి మోదీ, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు.

– పాయల్ శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్

'సాక్షి' చొరవ అభినందనీయం



జిల్లా ప్రజల ఆకాంక్షలను పాలకుల దృష్టికి తీసుకెళ్లేలా 'సాక్షి' దినపత్రిక మార్చి 5న అన్ని వర్గాలతో చర్చా వేదిక ఏర్పాటు చేసింది. ఆయా వర్గాల వారు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఐక్యంగా పోరాడాలని నిర్ణయించారు. దీంతో ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెరిగింది. వారు అసెంబ్లీ, పార్లమెంట్‌లో ప్రస్తావించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా వ్యవహరించడంతో లక్ష్యం నెరవేరే దిశగా అడుగులు పడ్డాయి. 'సాక్షి' చొరవకు అభినందనలు.

– సోగాల సుదర్శన్, ఎయిర్‌పోర్టు సాధన అడహక్ కమిటీ సభ్యుడు

బీసీ బంద్ సక్సెస్


హైదరాబాద్‌లో నిరసిస్తున్న ఎమ్మెల్యే శంకర్


ఉట్నూర్‌లో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు


ఆదిలాబాద్ బస్టాండ్‌లో నిలిచిపోయిన బస్సులు

- డిపోలకే పరిమితమైన బస్సులు
- దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసిన వ్యాపారులు
- మద్దతు తెలిపిన ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు

ఆదిలాబాద్‌రూరల్: స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా జిల్లాలో శనివారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. బీసీ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీరికి ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి. వేకువజామునే నాయకులు ఆదిలాబాద్, ఉట్నూర్ ఆర్టీసీ డిపోలకు చేరుకున్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట బైఠాయించి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఆదిలాబాద్‌లో 129, ఉట్నూర్‌లో 34 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. కొంత మంది ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించగా వారు అధిక చార్జీలు వసూలు చేశారు. దీంతో ప్రయాణికులు ఆర్థిక ఇబ్బందులు పడ్డారు.వ్యాపార, వాణిజ్య దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్ పాటించి సహకరించారు. ప్రైవేట్ కళాశాలలు, విద్యా సంస్థలు ముందస్తుగానే సెలవు ప్రకటించారు. దుకాణాలు మూసి ఉండడంతో జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండల కేంద్రాల్లోని వాణిజ్య కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

- బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో బైక్ ర్యాలీ చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు మాట్లాడుతూ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించేంత వరకు ఉద్యమిస్తామన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఇష్టం లేదన్నారు. టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత మాట్లాడుతూ, ఎన్నికల హామీ మేరకు బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో ఇచ్చిందని, అయితే దాన్ని వ్యతిరేకిస్తూ కొందరూ కోర్టుకు వెళ్లడం సరికాదన్నారు. ఇందులో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్, ఏఐటీయూసీ నాయకుడు దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆధ్వర్యంలో బంద్‌ను పర్యవేక్షించారు. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం బీజేపీ, కాంగ్రెస్‌లకు పెద్ద విషయం కాదన్నారు. వారు తలచుకుంటే సాధ్యమవుతుందన్నారు. ఇందులో పార్టీ నాయకులు నారాయణ, మెట్టు ప్రహ్లాద్, శివకుమార్, శ్రీకాంత్, ధమ్మాపాల్, తదితరులున్నారు.
- వామపక్షాల ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం నుంచి ర్యాలీ చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ మాట్లాడుతూ, బీసీల రిజర్వేషన్ కోసం అన్ని పార్టీలు ఉద్యమిస్తున్నాయన్నారు.
- బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టి అక్కడక్కడ తెరచి ఉన్న దుకాణాలను బంద్ చేయించారు. ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, పాయల్ శరత్, కిరణ్, కృష్ణయాదవ్, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.
- ఇదిలా ఉండగా ఉట్నూర్‌లో చేపట్టిన బంద్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు.

రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్ కల్పించాలి

ఆదిలాబాద్: బీసీలకు రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్ కల్పించాలని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బీసీ బంద్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాన్ని తలపించేలా బీసీ ఉద్యమం కొనసాగాలన్నారు.


బైక్ ర్యాలీలో పాల్గొన్న కంది శ్రీనివాసరెడ్డి


నినాదాలు చేస్తున్న ఆయా పార్టీల నాయకులు

న్యూస్‌రీల్

ఆదివాసీ, గిరిజన సంప్రదాయలు గొప్పవి

- ఎస్పీ అఖిల్ మహాజన్


ఆదివాసీలతో కలిసి కోలాటమాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ కాజల్‌సింగ్

సిరికొండ: ఆదివాసీ, గిరిజన సంప్రదాయాలు గొప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మండలంలోని రిమ్మ గ్రామంలో శనివారం దండారీ ఉత్సవాలు నిర్వహించారు. ఏఎస్పీ కాజల్‌సింగ్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. గ్రామస్తులు సంప్రదాయ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గుస్సాడీలతో కలిసి ఎస్పీ, ఏఎస్పీ కోలాట మాడి నృత్యం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆదివాసీలు తమ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఇచ్చోడ సీఐ రాజు, ఎస్సై పూజ, గ్రామ పటేల్ శంకర్, మాజీ సర్పంచ్ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మత్తడిగూడలో..

ఉట్నూర్‌రూరల్: మండలంలోని మత్తడిగూడలో నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో ఎస్పీతో పాటు ఉట్నూర్ ఏఎస్పీ పాల్గొన్నారు. వారి సీఐ ప్రసాద్, ఎస్సై ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఈవీఎంల గోదాం తనిఖీ

కైలాస్‌నగర్: పట్టణంలోని శాంతినగర్‌లో గల ఈవీఎంలను భద్రపర్చిన గోదాంను కలెక్టర్ రాజర్షి షా శనివారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గోడౌన్‌ను సందర్శించిన ఆయన అక్కడి భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు వంటి అంశాలను పరిశీలించారు. పరిసర ప్రాంతంలో అనధికారిక వ్యక్తులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని భద్రతా సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఆర్డీవో స్రవంతి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాలు పంచపూల, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులున్నారు.

దరఖాస్తులు తగ్గినా.. ఆదాయం తగ్గలే

- జిల్లాలో 40 మద్యం షాపులకు 711 దరఖాస్తులు
- గతంలో ఇవే దుకాణాలకు 1,047 టెండర్లు
- ఈ సారి మహిళల పేరిట పెద్ద ఎత్తున దరఖాస్తులు
- 23న రత్నా గార్డెన్‌లో లక్కీడ్రా


మద్యం షాపులకు దరఖాస్తులు అందజేస్తున్న మహిళలు

ఆదిలాబాద్‌టౌన్: ఎక్సైజ్ టెండర్ల ప్రక్రియ శనివారం ముగిసింది. జిల్లాలో 2023–25 మద్యం పాలసీతో పోల్చితే ఈ సారి (2025–27కి సంబంధించి) దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. అయినప్పటికీ ప్రభుత్వ ఆదాయానికి గండిపడలేదు. గతంలో దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు ఉండగా.. ఈ సారి రూ.3లక్షలకు పెంచారు. దీంతో టెండర్‌దారులు అంతగా ఆసక్తి కనబర్చనట్లు స్పష్టమవుతుంది. శనివారం రాత్రి 8గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. ఎక్సైజ్ ఆదాయం పెంచేందుకు ఆ శాఖ అధికారులు తీవ్రంగా శ్రమించారు. గతంలో మద్యం షాపులకు టెండర్లు వేసిన వారిని, ప్రస్తుతం షాపులు నడుపుతున్న వారిని రండి బాబు..రండి.. దరఖాస్తు చేసుకోండని కోరడం గమనార్హం. సాయంత్రం ఐదు గంటలకే గడువు ముగియాల్సి ఉండగా ఆలస్యమైనా స్వీకరించేలా కార్యాలయంలోనే వేచి చూశారు. అయితే దరఖాస్తుల స్వీకరణ మొదలైనప్పటి నుంచి మందకొడిగా సాగిన ప్రక్రియ చివరి రెండు రోజుల్లో పుంజుకుంది. దీంతో ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నట్లుగా కనిపించింది. ఈ ప్రక్రియ చివరి రోజు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రఘురాం, జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ పర్యవేక్షణలో కొనసాగింది. ఈ నెల 23న ఆదిలాబాద్ పట్టణంలోని రత్నా గార్డెన్‌లో కలెక్టర్ రాజర్షి ఆధ్వర్యంలో షాపుల కేటాయింపునకు లక్కీ డ్రా నిర్వహించనున్నారు. ఇందులో అదృష్టం ఎవరిని వరించనుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఆదాయం తగ్గలే..

మద్యం షాపులకు గతంతో పోల్చితే దరఖాస్తులు తగ్గినప్పటికీ ప్రభుత్వ ఆదాయంలో మాత్రం అంతగా మార్పేమి రాలేదు. జిల్లాలో 40 షాపులకు గాను 2023లో 1047 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.20.94 కోట్ల ఆదాయం సమకూరింది. అయితే ఈసారి దరఖాస్తు ఫీజు రూ.3లక్షలకు పెంచింది. దీంతో దరఖాస్తులు తక్కువగా నమోదైనట్లు తెలుస్తోంది. శనివారం రాత్రి 8గంటల వరకు ఆ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 711 నమోదయ్యాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.21.33 కోట్ల ఆదాయం వచ్చింది. గతంతో పోల్చితే రూ.39లక్షల వరకు అదనపు ఆదాయం చేకూరింది. కాగా, మూడు రోజుల క్రితం 100లోపు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. ఎక్సైజ్ అధికారులు వ్యాపారులను ప్రోత్సహించడంతో చివరి రెండు రోజుల్లో పుంజుకున్నాయి. శుక్రవారం 391 నమోదు కాగా శనివారం 320 దరఖాస్తులు వచ్చాయి. ఒక షాపునకు పది కంటే తక్కువ దరఖాస్తులు ఉంటే వాటికి రీ టెండర్ నిర్వహించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. గతంలో తక్కువ దరఖాస్తులకు రీ టెండర్ నిర్వహించగా మళ్లీ లక్కీ డ్రా తీశారు. జిల్లాలో తొమ్మిది షాపులకు పదికంటే తక్కువ దరఖాస్తులు వచ్చాయి.

23న తేలనున్న అదృష్టం..

దరఖాస్తుదారుల్లో అదృష్టం ఎవరిని వరించనుందో ఈనెల 23న తేలనుంది. అనంతరం షాపులు దక్కించుకున్న వారు 1/6వ వంతు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఏడాది 3 స్లాబుల్లో ఫీజు చెల్లించాలి. జిల్లాలో రూ.65లక్షలు, రూ.55లక్షలు, రూ.50 లక్షల స్లాబులుగా ఫీజు నిర్ణయించారు.

మహిళల ఆసక్తి ..

ఈ ఎక్సైజ్ టెండర్లలో మహిళలు కూడా భారీగానే దరఖాస్తులు అందజేశారు. కొంతమంది వ్యాపారులు సెంటిమెంట్‌గా తమ కుటుంబంలోని మహిళల పేరిట టెండర్లు దాఖలు చేశారు. అయితే ఎంతమంది మహిళలు దరఖాస్తులు అందజేశారనే విషయాన్ని మాత్రం అధికారులు స్పష్టం చేయలేదు. కొంతమంది ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి వచ్చి దాఖలు చేయగా మరికొంతమంది వారి కుటుంబ సభ్యుల ద్వారా అందజేశారు.

అత్యధికంగా 5వ నంబర్ షాపునకు 36 దరఖాస్తులు

ఆదిలాబాద్ పట్టణంలోని 5వ నంబర్ షాపునకు అత్యధికంగా 36 దరఖాస్తులు రాగా, 6వ షాపునకు41 , 7వ షాపునకు 33, 8వ షాపునకు 32 వచ్చాయి. అలాగే అత్యల్పంగా 16వ షాపునకు ఒక దరఖాస్తు రాగా 17,18 షాపులకు రెండేసి దరఖాస్తుల చొప్పున వచ్చాయి. ఇచ్చోడ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 19, 20 షాపులకు 29 దరఖాస్తులు, అత్యల్పంగా 28 షాపునకు 2, 25వ షాపునకు 5, 27వ షాపునకు 7 దరఖాస్తులు వచ్చాయి. ఉట్నూర్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 39వ షాపునకు 25 దరఖాస్తులు రాగా, 34 షాపునకు 18, అలాగే 32, 33 షాపులకు 15 చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

ఈ ఏడాది వచ్చిన దరఖాస్తులు	711
వచ్చిన ఆదాయం	రూ.21.33 కోట్లు
ఎక్సైజ్‌స్టేషన్ల వారీగా దరఖాస్తులు	
ఆదిలాబాద్	396
ఇచ్చోడ	191
ఉట్నూర్	124
2023లో వచ్చిన దరఖాస్తులు	1,047
వచ్చిన ఆదాయం	రూ.20.94 కోట్లు

రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి

- స్లాట్ బుకింగ్‌పై అవగాహన కల్పించాలి
- కలెక్టర్ రాజర్షి షా


వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఆయా మండల వ్యవసాయాధికారులు, విస్తీర్ణ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పత్తి కొనుగోళ్లు, కౌలు రైతుల నమోదు, క్రాప్‌బుకింగ్, పంట నష్టం అంచనాలపై సమీక్షించి వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ ప్రక్రియను సమయానికి పూర్తి చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నిరక్షరాస్యులైన వారికి అవసరమైన సాంకేతిక సహకారం అందించాలన్నారు. కౌలు రైతుల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, రవాణా, చెల్లింపు వంటి ప్రక్రియలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మార్కెట్ యార్డు అధికారులతో సమన్వయంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్‌స్వామి, టెక్నికల్ ఏవో శివకుమార్, మార్కెటింగ్ ఏడీ మార్కెటింగ్ గజానంద్, తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించొద్దు



కైలాస్‌నగర్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరించేలా వ్యవహరించడం దుర్మార్గమని వివిధ వర్గాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. 'సాక్షి'పై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

అప్రజాస్వామికం



పత్రిక స్వేచ్ఛను హరించేలా 'సాక్షి' కార్యాలయంపై ఏపీ ప్రభుత్వం పోలీసులతో దాడులు చేయించడం, ఎడిటర్ ధనంజయ్‌రెడ్డిపై అక్రమంగా కేసులు నమోదు చేయడం అప్రజాస్వామికం. ఇలాంటి చర్యలను తక్షణమే మానుకోవాలి.

– మేస్రం భాస్కర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి

మీడియా స్వేచ్ఛను కాపాడాలి



అధికారముందనే అహంకారంతో జర్నలిస్టులను, మీడియా సంస్థలను ఇబ్బందులకు గురిచేసేలా ఏపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానం సరికాదు. జర్నలిస్టుల గళాన్ని అణచివేసేలా వ్యవహరిస్తున్న చర్యలు తక్షణమే మానుకోవాలి.

– నక్క రాందాస్, ఎమ్మార్పీఎస్, జిల్లా అధికార ప్రతినిధి

వాస్తవాలు రాస్తే కేసులు పెడుతారా?



ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారని 'సాక్షి' జర్నలిస్టులు, ఎడిటర్ ధనంజయ్‌రెడ్డిపై ఏపీ ప్రభుత్వం కేసులు నమోదు చేయడం సరికాదు. వాస్తవాలు రాస్తే కేసులు నమోదు చేస్తారా.. ఇది ఎంత వరకు సమంజసం.

– సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక



అశ్వితను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

మంచిర్యాలఅర్బన్: కాకతీయ యూనివర్సిటీలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించిన అంతర్‌జిల్లా బ్యాడ్మింటన్ పోటీల్లో మంచిర్యాలలోని మిమ్స్‌లో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అశ్విత పాల్గొని ప్రతిభ కనబర్చింది. నవంబర్ 21 నుంచి 23 వరకు బెంగళూరులో జరిగే సౌత్‌జోన్ టోర్నమెంట్‌లో యూనివర్సిటీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనుంది. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాసరాజు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి, శ్రీధర్‌రావు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు

కోటపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ఈనెల 17న నస్పూర్‌లో జరిగిన అండర్–17, అండర్–19 పోటీల్లో సాయిచందన, సౌమ్య, జశ్వంత్ ప్రతిభ కనబర్చినట్లు ఆయన పేర్కొన్నారు.

కోలిండియా పోటీల్లో సత్తా

బెల్లంపల్లి/మందమర్రిరూరల్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈనెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించిన కోలిండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో సింగరేణి కార్మికులు సత్తాచాటారు. 75 కిలోల విభాగంలో ఈపీ ఆపరేటర్లు జనగామ మొగిలి రజత పతకం, పెసరి అర్జున్ కాంస్య పతకం, మందమర్రి ఏరియా వర్క్‌షాప్‌లో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న బత్తుల వెంకటస్వామి 85–90 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. పతకాలు సాధించిన కార్మికులను శనివారం సింగరేణి అధికారులు, బెల్లంపల్లి సైజిమ్ నిర్వాహకులు, సీనియర్ క్రీడాకారులు ప్రత్యేకంగా అభినందించారు.

'లంబాడాలు ఐకమత్యంగా ఉండాలి'

పాతమంచిర్యాల: లంబాడా జాతి బిడ్డలు తమ సమస్యల పరిష్కారం కోసం ఐకమత్యంగా ముందుకు సాగాలని మాజీ ఎంపీ రవీంద్రనాయక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని నార్తిన్ హోటల్‌లో లంబాడా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారా, సుగాలి, ఎరుకల కులాల వారిపై ఆదివాసీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం(ఏబీఎస్‌ఎస్) అధ్యక్షుడు అజ్మీర శ్యాంనాయక్, నాయకులు ఆత్మారావు, బూక్యా రవినాయక్, ధరావత్ పంతుల నాయక్, ఏబీఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు సపాట్ శంకర్ పాల్గొన్నారు.

కరెంటు సమస్యలపై కాలయాపన

- గిర్రున తిరుగుతున్న మీటరు..!
- కరెంటు బిల్లులతో బెంబేలు
- ఫిర్యాదులపై నెలలు గడుస్తున్నా పరిశీలన కరువు

మంచిర్యాలఅగ్రికల్చర్: సాంకేతిక లోపమో.. మరేదైనా కారణమో తెలియదు గానీ కొందరి ఇళ్లలో కరెంటు మీటరు గిర్రున తిరుగుతోంది. రూ.వేలల్లో వస్తున్న బిల్లులతో వినియోగదారులు తల పట్టుకోవాల్సి వస్తోంది. మరోవైపు కరెంటు సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే నెలలు గడిచినా పరిష్కారానికి నోచుకోవడం లేదు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, హై ఓల్టేజ్, ప్రమాదకరంగా ఉన్నత స్తంభాలు, బిల్లుల్లో హెచ్చుతగ్గులు తదితర సమస్యలపై ప్రతీ సోమవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. దీంతో విద్యుత్ బిల్లులతోపాటు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగలతో పశువులు, మూగజీవాలు, మనుషులకు ప్రమాదం పొంచి ఉందని ఫిర్యాదు చేస్తున్నారు. కానీ సమస్య పరిష్కారం కాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో దండేపల్లి మండలం విద్యుత్ స్తంభానికి షాక్ వస్తుందని పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అదే స్తంభానికి తగిలి పశువు, లేగదూడ చనిపోవడంతో తేరుకుని సవరించారు. వినియోగదారులు నేరుగా, ఆన్‌లైన్, మొబైల్ ద్వారా ఏ ఫిర్యాదు అందించినా వెంటనే పరిష్కరించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచిస్తున్నారు. అయినా కొన్ని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.



అధిక బిల్లుపై ఆగస్టు 4న విద్యుత్ ప్రజావాణిలో ఎస్ఈకి ఫిర్యాదు చేస్తున్న జోగుల విజయ

- జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన కొరవి వెంకటేష్ తన ఇంటి వద్ద ఉన్న విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరింది. వర్షాలతో షాక్ వస్తుందని లైన్‌మెన్, ఏఈకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. జూలై 28న ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అయినా సమస్య పరిష్కారం కాలేదు.
- నెన్నెల మండలం అవుడంకు చెందిన ఎం.మహేష్ భీమారం మండలం కాజిపల్లి శివారులోని తన పొలంలో 80చింతచెట్లు తీగలకు అడ్డు వస్తున్నాయని విద్యుత శాఖ అధికారులు నరికివేశారని, రూ.లక్షల్లో నష్టపోయానని, నష్ట పరిహారం చెల్లించాలని పలుమార్లు విద్యుత్ అధికారుల, ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా పరిహారం అందలేదు.

రెండు నెలలు గడిచింది..

ఆర్ఆర్‌నగర్‌లోని తన ఇంటికి గత కొన్ని నెలల నుంచి రూ.వేలల్లో విద్యుత్ బిల్లు వస్తోందని విద్యుత్ అధికారులకు, ఆగస్టు 4న ప్రజావాణిలో ఎస్ఈకి ఫిర్యాదు చేశాను. రూ.150 చెల్లిస్తే సిబ్బంది మీటర్‌ను పరిశీలిస్తారని చెప్పారు. ఎన్పీడీసీఎల్ డీఈ ఆపరేషన్ పేరిట నగదు చెల్లించి రెండు నెలలైంది. వందల్లో రావాల్సిన బిల్లు వేలల్లో వస్తోంది. ఈ నెల రూ.3,882 బిల్లు చెల్లించాలని, లేదంటే కరెంటు కట్ చేస్తామని ఇబ్బంది పెడుతున్నారు.

– జోగుల విజయ, మంచిర్యాల

స్తంభం తొలగించాలని ఫిర్యాదు చేసినా..



పాతస్తంభం ప్రమాదకరంగా మారిందని, వర్షాలకు షాక్ వస్తుందని, స్తంభం మార్చాలని లైన్‌మెన్, ఈఈకి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో రెండు సార్లు ఫిర్యాదు చేసిన.

– కోరవి వెంకటేష్, గ్రామం: ఇందారం, మం: జైపూర్

బాసరలో శృంగేరీ పీఠాధిపతి పూజలు


భక్తులను ఆశీర్వదిస్తూ ప్రసాదాలు అందజేస్తున్న శృంగేరీ పీఠాధిపతి

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతి దేవస్థానంలో శనివారం ఆధ్యాత్మిక ఉత్సాహం వెల్లివిరిసింది. విజయయాత్రలో భాగంగా దక్షిణామ్నాయ శృంగేరీ శారదా పీఠాధిపతి జగద్గురువు విధుశేఖర భారతీ మహాస్వామివారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో అంజనాదేవి ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారు శ్రీసరస్వతి, మహాకాళి, మహాలక్ష్మీ అమ్మవార్ల గర్భాలయాలలో వేదమంత్రోచ్ఛరణల మధ్య అభిషేక, హారతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణపై దిశానిర్దేశం

పూజల అనంతరం స్వామిజీ భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు చేశారు. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతీ హిందువు కర్తవ్యమని, ధార్మిక విలువలతో జీవించడం సమాజ ఉన్నతికి దోహదం చేస్తుందన్నారు. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం..

బాసరలో నూతనంగా నిర్మించిన లలితా చంద్రమౌళీశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. వేలేటి రాజేందర్ శర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, మహాసంకల్పం వంటి కార్యక్రమాలు జరిగాయి. ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, అంజనాదేవి, బాసర గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.


మహాకాళి అమ్మవారి ఆలయంలో హారతి ఇస్తున్న విధుశేఖర భారతీస్వామి

జాతీయస్థాయిలో గుర్తింపు హర్షణీయం

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆది కర్మయోగి, ధర్తి ఆబా జన భాగీదారి పథకాలను ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలలో సమర్థవంతంగా అమలు చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం హర్షణీయమని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివాసీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ నెల 17న నిర్వహించిన జాతీయ సదస్సులో ఆదిలాబాద్ జిల్లా నుంచి ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్‌తో పాటు జిల్లా మాస్టర్ ట్రైనర్లు అర్క వసంత్, బ్లాక్ మాస్టర్ ట్రైనర్‌లు రాజేశ్‌బాబు, నందకిషోర్ పాల్గొన్నట్లు తెలిపారు. పథకాల అమలులో వారు చేసిన కృషికి పురస్కారాలు అందుకోవడం అభినందనీయమన్నారు.


పురస్కారాలు అందుకున్న మాస్టర్ ట్రైనర్లు

కన్నతండ్రినే కడతేర్చాడు..

- మద్యం మత్తులో కర్రతో కొట్టిచంపిన కుమారుడు


శంకర్‌నాయక్ (ఫైల్)


రక్తపు మడుగులో శంకర్‌నాయక్ మృతదేహం

జన్నారం: మద్యానికి బానిసైన కుమారుడు తన కన్న తండ్రినే కర్రతో కొట్టిచంపిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం గ్రామ పంచాయతీలోని సేవదాస్‌నగర్‌కు చెందిన జాదవ్ శంకర్‌నాయక్ (60)కు ముగ్గురు కూతుర్లు, కుమారుడు సంతానం. నలుగురికి పెళ్లిళ్లు చేశాడు. శంకర్ నాయక్ భార్య రేణుకాబాయి రెండేళ్ల క్యాన్సర్‌తో మృతి చెందింది. కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న కుమారుడు నూర్‌సింగ్ నాయక్ మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యను కొడుతుండడంతో ఏడాది క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తండ్రితో కలిసి ఉంటున్నాడు. తాగేందుకు డబ్బులు ఇవ్వాలని వేధించేవాడు. పలుమార్లు గొడ్డలితో చంపుతానని వెంటపడగా శంకర్‌నాయక్ తప్పించుకున్నాడు. ఈనెల 17న కూడా గొడ్డలితో చంపుతానని వెంటపడగా స్థానికులు 100కు డయల్ చేయడంతో పోలీసులు వచ్చి నూర్‌సింగ్‌ను బెదిరించి వెళ్లిపోయారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో మద్యం సేవించి ఇంటికి వచ్చి రొట్టెలు చేస్తున్న తండ్రిని కర్రతో తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత బంధువులకు ఫోన్ చేసి చెప్పాడు. కాలనీవాసులు నిలదీయడంతో పరారయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎస్సై గొల్లపెల్లి అనూష సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంతో పరిశీలించారు. మృతుని చిన్న కూతురు జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కాగజ్‌నగర్ టౌన్: జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యాసంవత్సరానికి గానూ 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తు గడువు అక్టోబర్ 23 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 8, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 26 తులాల బంగారం, అరకిలో వెండి, నగదు అపహరణ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన కొరిపెల్లి రేణుకాదేవి శుక్రవారం తమ బంధువుల ఇంట్లో పుట్టినరోజు వేడుకలకు స్థానిక శాస్త్రినగర్ కాలనీకి వెళ్లింది. చీకటి పడడంతో రాత్రి అక్కడే ఉండిపోయింది. గమనించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న 26 తులాల బంగారం, అరకిలో వెండి, రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్టు

భీమారం: మండల కేంద్రంలోని లక్ష్మీదేవర ఆలయంలో ఈనెల 15న చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా రంగంలోకి దిగిన పోలీసులు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన సిరికొండ లక్ష్మణ్, మహారాష్ట్రలోని రాజూరా తాలూకా చున్నాల గ్రామానికి చెందిన కాకట్ల కేశవరెడ్డిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కిలో 900 గ్రాముల వెండి, 10 గ్రాముల బంగారం, రూ.3,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. జల్సాలకు అలవాటు పడిన ఈఇద్దరు నిందితులపై ఇప్పటికే పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి జుడీషియల్ కస్టడీకి తరలించినట్లు తెలిపారు. ఒక్క రోజులో కేసును ఛేదించిన భీమారం ఎస్సై శ్వేత, శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్, సిబ్బంది మల్లయ్య, కిరణ్‌ను సీఐ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వేణుచందర్

380 గంజాయి మొక్కలు స్వాధీనం

వాంకిడి: పత్తి చేనులో రహస్యంగా సాగు చేస్తున్న 380 గంజాయి మొక్కలను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. చిచ్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాం చిచ్‌పల్లి గ్రామ శివారులోని మడావి నగేష్‌కు చెందిన పత్తి చేనులో తనిఖీలు నిర్వహించగా 380 గంజాయి మొక్కలను గుర్తించినట్లు పేర్కొన్నారు. నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు అదిత్, ప్రదీప్, నయీం, మల్లేశ్, హోంగార్డ్ బలిరాం, తదితరులు పాల్గొన్నారు.


పట్టుబడిన మొక్కలతో ఎస్సై

అడవిలో అరుదైన 'హైగ్రోసైబ్ పెల్లిసిడా'


హైగ్రోసైబ్ పెల్లిసిడా

జన్నారం: హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ నార్త్ తెలంగాణ కోఆర్డినేటర్ డాక్టర్ ఎనగందుల వెంకటేశ్ శనివారం కవ్వాల్ టైగర్ జోన్‌లో శిలీంద్ర జాతికి చెందిన అరుదైన హైగ్రోసైబ్ పెల్లిసిడాను కనుగొన్నారు. 2024లో కేరళ రాష్ట్రంలోని హైగ్రోఫోరేసి కుటుంబంలో ఒక కొత్త జాతిగా మొదటిసారి కనుగొన్నారు. చిన్న, సున్నితమైన అగారిక్ ఫంగస్ అని తెలిపారు. ఇవి సాధారణంగా గడ్డి మైదానాలు, చిత్తడి ప్రాంతాల్లో కనిపిస్తాయని, దీనిని వాక్స్‌కప్ అని పిలుస్తారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కవ్వాల్ టైగర్‌జోన్‌లో మొదటిసారి నిర్ధారించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆవులు తరలిస్తున్న లారీ పట్టివేత

సాత్నాల: భోరజ్ మండలంలోని చెక్‌పోస్ట్ వద్ద ఆవులు తరలిస్తున్న కంటైనర్ లారీని పట్టుకున్నట్లు ఎస్సై గౌతమ్ పవర్ తెలిపారు. శనివారం నాగ్‌పూర్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న కంటైనర్‌ను తనిఖీ చేయడంతో 25 ఆవులు ఉన్నట్లు సిబ్బంది గుర్తించారు. ఎస్సైకి సమాచారం సమాచారం అందించడంతో ఆవులను ఇచ్చోడలోని గోశాలకు తరలించారు. డ్రైవర్ గురురవాల్‌సింగ్‌పై కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్, మోహన్‌గౌడ్, షైమా సుల్తానా, జాదవ్ గోవింద్, తదితరులు పాల్గొన్నారు.


పట్టుకున్న లారీతో పోలీసులు

స్వర్ణ వాగులో పడి ఒకరు మృతి

సారంగాపూర్: ప్రమాదవశాత్తు స్వర్ణ వాగులోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని ప్యారమూర్ గ్రామానికి చెందిన పగడపు భోజన్న (59) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. బోరిగాంలో ఉంటున్న అతని అక్క పోశవ్వ మూడు రోజుల క్రితం తన ఇంటికి తీసుకువచ్చింది. శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన భోజన్న తిరిగిరాలేదు. శనివారం స్వర్ణ వాగులో మృతదేహం కనిపించడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


మృతదేహాన్ని బయటకు తీయిస్తున్న ఎస్సై

పేకాడుతున్న ఏడుగురు అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఎరోడ్రమ్ సమీపంలో గల ఆమన్ స్విమ్మింగ్‌పూల్ గెస్ట్‌హౌస్‌లో శనివారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.23,400 నగదు, 8 సెల్‌ఫోన్లు, ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా


బోల్తా పడిన కారు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో అదుపుతప్పి కారు బోల్తా పడింది. స్థానికులు, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు వరంగల్‌కు చెందిన ఐదుగురు స్నేహితులు కారులో షిరిడికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వరంగల్ వెళ్లే క్రమంలో స్థానిక కంచరోని చెరువు కట్ట రహదారిపై అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో కారు బోల్తా పడింది. బెలూన్లు తెరుచుకోవడంతో ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా, ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బైక్ అదుపుతప్పి వైద్యుడు మృతి

తరిగొప్పుల: బైక్ అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టిన ఘటనలో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా ఒప్పిచెర్ల గ్రామానికి చెందిన మాచర్ల రవికిషోర్ (31) మృతి చెందాడు. మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రవికిషోర్ గురువారం తన స్వగ్రామం ఒప్పిచెర్లకు వెళ్లి కారంపూడిలో కొత్త బైక్ కొన్నాడు. శుక్రవారం అదే బైక్‌పై తిరిగి మంచిర్యాలకు వస్తుండగా రాత్రి 11 గంటల సమయంలో జనగామ జిల్లా తరిగొప్పుల మండలం అక్కరాజుపల్లి క్రాస్‌రోడ్ సమీపంలో మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్నాడు. దీంతో అతడి తల, ఛాతి భాగంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య హిమబిందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కాసర్ల రాజయ్య తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడు..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్లలో నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో పడి ఉన్న గుర్తు తెలియని వృద్ధుడిని గమనించిన స్థానికులు అందించిన సమాచారం మేరకు 108 ద్వారా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తెలిసిన వారు 8712656541, 8712658667 నంబర్‌లకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

జైనథ్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గౌతమ్ పవర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని లక్ష్మంపూర్ గ్రామానికి చెందిన కార్ల శంకర్ (35) భార్య లక్ష్మి నాలుగు నెలల క్రితం ఆత్మహత్య చేసుకుంది. దీంతో మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. శనివారం ఉదయం తండ్రి విట్టల్ తలుపు తీసి చూడగా ఉరేసుకుని కనిపించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాలుగు నెలల వ్యవధిలో తల్లిదండ్రులు మృతి చెందడంతో చిన్నారులు అనాథలయ్యారు.

అధికారి చెప్పినా ఆగని దందా





దీపావళికి స్వీట్లకు మంచి డిమాండ్ ఉంటుంది. దీనిని ఆసరా చేసుకున్న కొందరు స్వీట్ల తయారీలో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో అనుమతి లేకుండా స్వీట్లు తయారు చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదు రావడంతో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రత్యూష ఈ నెల 14న తనిఖీలు నిర్వహించారు. అనుమతి లేకపోవడం, అపరిశుభ్ర వాతావరణంలో స్వీట్లు తయారు చేస్తుండడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తయారీ కేంద్రాన్ని సీజ్ చేశామని చెప్పారు. ఆ తర్వాత వదిలేయడంతో నిర్వాహకులు మళ్లీ స్వీట్ దందా మొదలుపెట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



